# అమ్మ

వీరభద్రరావ్ పమ్మి

బీరు సీసా ఖాళీ అయిపోయింది.

కార్లోంచి బైటికి విసిరాను. కాలవలో పడింది.

వీరేంద్రనాధ్ ఓసారి కాలవకేసి చూసి, మళ్ళీ రోడ్డుకేసి చూశాడు.

'ఖాళీ సీసా నీట్లో మునుగుతుందా?—తేలుతుందా?'

'జీవితంకూడా అంతే—ఎప్పుడు ఎక్కడ మునుగుతుందో, ఎందుకు తేలుతుందో మనకి తెలియదు.

'ఏమిటీ ఆలోచనలు'

నాకే అర్థం కావడంలేదు. మనసు ఉల్లాసంగా వుంది. చల్లగాలి హాయిగా వుంది. వీరేంద్ర కార్ డ్రైవింగ్‌లో నిపుణుడు. స్పీడుగా పోనిస్తున్నాడు.

"భీమవరం ఎన్ని మైళ్ళుంది?"

నిశ్శబ్దాన్ని నేనే ఛేదించాను.

" వచ్చేది ఏప్పూర—అక్కడికి పన్నెండు మైళ్ళు."

స్టీరింగ్ వదిలి సిగరెట్ అంటించుకున్నాడు వీరేంద్ర.

"ఇంతకీ పెళ్ళెవరిది?'' వీరేంద్ర అడిగాడు.

"అన్నపూర్ణని "

అంతపుమించి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియలేదు.

నాకు వెంటనే అన్నపూర్ణ మనస్సులో మెదిలింది—మనస్సు ఆర్ద్రమైంది.

నాకు వెనకటి రోజులు గుర్తొచ్చాయి. దారిద్ర్యం మమ్మల్ని పులిలాగా వెంటాడుతుంటే నేను, నాన్న, అమ్మ చెల్లి మేకపిల్లల్లాగ వణికిపోతూ పరుగెత్తిన రోజులు. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయిన రోజులు—

నాకు శంకరం మామయ్య గుర్తుకొచ్చాడు. మనసు జుగుప్సతో నిండిపోయింది. క్షుద్ర దేవతను తల్చుకున్నట్టు ఉలిక్కిపడ్డాను.

గతమంతా బాధామయంగా, పీడకలలాగ అలిసిపోయిన ఆటలాగ అనిపించింది—కనిపించింది.

* * *

నాన్న స్కూల్ టీచర్. ..

నాన్న చిన్న ఉద్యోగి..

నాన్నకు నేనంటే ఇష్టం.

నాన్నకు నన్ను పెద్ద పొజిషన్‌లో చూడాలని వుంటుంది.

ఈ విషయాలు నేను చిన్నప్పుడే అంటే పదేళ్ళు రాకుండానే అర్థం చేసుకున్నాను.

నేను స్కూల్ ఫైనల్ స్కూల్ ఫస్టులో పాసైనప్పుడు నాన్న ఎంత ఆనందించాడో అంత ఆందోళన పడ్డాడు. నన్ను చదివించడం నాన్నకు ఆర్థికంగా సమస్య. నేనూ ఏ గుమాస్తాయో స్కూల్ టీచరో ఐపోయి జీవితాన్ని ఎక్కడికక్కడే కత్తిరించుకుంటూ బతుకుతానని ఆయన భయం—

★ యవ్వనంలో ఉన్న స్త్రీ పురుషులకు మధ్య కలిగేది కేవలం శారీరికవాంఛతో కూడిన ఆకర్షణే అయి ఉండాలన్నది రూలు కాదు. అంతకుమించిన అనుబంధం ఇద్దరి మధ్య నెలకొన్నప్పుడు—ఆ అనుబంధం అందించే అద్భుతానుభూతిని ఎలా వర్ణించగలం? ★

వెనక, ముందు, కుడి, ఎడమ బాగా ఆలోచించాడు. అప్పుచెయ్యడం ఆయనకు పెద్ద కష్టం కాదు. మంచి టీచర్‌గా సంపాయించుకున్న పలుకుబడిని, పేరుని పణంగా పెట్టి అప్పు పుట్టించగలడు—కాని తీర్చడం .ఎలా?

వారంపదిరోజులు తనలో తనే మధనపడ్డాడు. చివరికో రోజు నన్ను పిల్చి

"నేను చాలా ఆలోచించిన మీదట ఓ నిర్ణయానికొచ్చాను నాన్నా!"

నాన్న మాటల్లో నిస్సహాయత వుంది. తనేదో చెయ్యలేక పోతున్నాడని గిల్టీగా ఫీలవుతున్నాడు. ఆయన నా భవిష్యత్తు విషయం మాట్లాడుతున్నాడని నాకు అర్థమైంది.

"తెలివైన కుర్రాడివి చదివిస్తే జీవితంలో పై అంతస్థులు చూడగలవని నా నమ్మకం—అంతేకాదు నీకు సరైన దారిచూపించడం నా బాధ్యతకూడా."

నాన్న మాటలకి వెతుక్కుంటున్నాడు.

"మీరెలా చెప్పినా వింటా నాన్నా!" నేను ధైర్యం చెప్పాను.

"నాకు తెలుసురా—అందుకే నీ భవిష్యత్తు విషయం ఇంతగా ఆలోచిస్తుంట."

ఐదునిమిషాలు ఇద్దరం మాట్లాడలేదు.

"నేను వెళ్ళి రేపు మీ శంకరం మామయ్యతో మాట్లాడివస్తాను. నువ్వు వాళ్లింట్లో వుండి చదువుకో—"

నాన్న మాటలు నాకు చాలా ఉత్సాహాన్నిచ్చాయి.

శంకరం మామయ్య, మా అమ్మస్వయానా అప్ప చెల్లెళ్ళ బిడ్డలు. అయిన భీమవరంలో ఉంటాడు. ఇల్లరికం వెళ్ళినందువల్ల ఆయనకు అత్తవారి ఆస్థి బాగా కల్సింది. ఆస్థి తెచ్చింది కనుక కనకం అత్తయ్యంటే మామయ్యకు గౌరవాభిమానాలేగాక, భయభక్తులు కూడా వున్నాయి. వాళ్ళింట్లో అన్ని విషయాల్లోను అత్తయ్యమాటే నెగ్గుతుంది. సాగుతుంది.

నాన్న నా విషయం, అత్తయ్యతో మాట్లాడాడో మామయ్యతో మాట్లాడాడో నాకు తెలియదు. భీమవరం నుంచి చాలా సంతోషంగా తిరిగొచ్చాడు.

"శంకరం మామయ్య దేముడురా—నిన్ను వాళ్ళింట్లో పెట్టుకోడానికి ఒప్పుకున్నాడు"

నాన్న ఆనందంగా చెప్పాడు.

వివరాలన్నీ ఆయనే చెప్పాడు.

నేను శంకరం మామయ్యగారింట్లో ఉండి పి. యు. సి చదువుకోవాలి. నన్ను వాళ్ళింట్లో అట్టేపెట్టుకున్నందుగ్గాను నాన్న ప్రతినెల వాళ్ళకి డెబ్భై రూపాయలివ్వాలి—పేయింగ్ గెస్టు పద్ధతి—

అదిగాక నాన్న నా ఖర్చులకి మరో ఇరవై రూపాయలిస్తానన్నాడు.

అంటే మొత్తంమీద నాన్నకు నావల్ల నెలకు తొంభై రూపాయల ఖర్చు. అక్క పెళ్లి కోసం నాన్న చేసిన అప్పు తీర్చలేక ఇప్పటికీ వడ్డీలు కడుతూనే ఉన్నాడు. నన్ను పెద్ద పొజిషన్‌లో చూడాలంటే నాన్న, అమ్మ, చెల్లి కొన్నేళ్ళపాటు ఓ పూట భోజనం త్యాగం చెయ్యాలి.

నా అభ్యంతరాల్ని నాన్న వెనక్కి నెట్టేశాడు.

నేను భీమవరం ప్రయాణమయ్యాను.

శంకరం మామయ్య నాన్న చెప్పినట్టు దేవుళ్లా కనబళ్ళేదు—కనీసం ఆయన్ను కట్టుకుందనైనా అత్తయ్య దేవతలా కనబళ్ళేదు.

వాళ్ళకు బోలెడంత డబ్బు, ఆస్థి వున్నాయి.

కాబట్టి ఉందన్న గర్వం బాగావుంది.

మాకు ఆస్థిలేదు—డబ్బులేదు.

అందుచేత మేమంటే వాళ్ళకి నిరసన భావం వుంది.

ఈ రెండూ వాళ్ళ మాటల్లో అడుగడుగునా ధ్వనిస్తాయి.

అటువంటి వాతావరణంలో పుట్టి పెరిగారు కనుక వాళ్ళ పిల్లలక్కూడా అంతులేని అతిశయంవుంది. వాళ్ళంతా నన్ను ఓ బ్రూట్ కింద పల్లెటూరి వాడి కింద, వాళ్ళ పంచన బతుకుతున్న వాడికింద జమకట్టి మాట్లాడేవారు. ఆ ఇంట్లో నేను మెచ్చిన నాకునచ్చిన వ్యక్తి అన్నపూర్ణ

అన్నపూర్ణకి ఆ ఇంట్లో చద్దన్నం కోసం పనిచేసే పని పిల్లకున్న హోదావుంది. ఆమె నిజంగా పనిపిల్లలాగే పనిచేసేది. ఆమె సాధారణంగా చద్దన్నమే తినేది.

ఆమెకు పధ్నాలుగేళ్ళుంటాయి.

ఆమె కనకం అత్తయ్యకు చాలా దూరపు చుట్టాలమ్మాయి. రెండో ఏట తండ్రిని పదో ఏట వంటలుచేసి బ్రతికే తల్లిని పోగొట్టుకుంది. ఆమె దిక్కులేనిది. "దిక్కులేని పిల్లకదాని" కనకం అత్తయ్య చేరదీసింది. ఆమె దినచర్య చూస్తే నాకు జాలి, ఆశ్చర్యం ఒక్కసారే కలిగేవి.


ఉదయమే లేచి గిన్నెలు తోమడం, కాఫీలు పెట్టడం, వంట చెయ్యడం, వడ్డించడం— మళ్ళీ సాయంత్రం. ఇంట్లో వంట మనిషిగాను, పనిపిల్లగాను అన్ని పనులూ తనే చేసేది. ఎంతచేసినా ఆమెక్కావల్సిన ఆదరణ, అభిమానం ఆ ఇంట్లో శూన్యం. ఏ రోజూ అత్తయ్యచేత తిట్లు చివాట్లు దెబ్బలు తినేది.

ఆమంటే నాకు జాలితో కూడిన ఇష్టం ఏర్పడింది. ఇంత చేసినా ఆమె తినేసరికి అన్నం వుంటుందో, లేదో అనుమానమే — అత్తియ్య బియ్యం దగ్గర్నుంచి అన్నీ కొల్చి ఇచ్చేది. అంత డబ్బున్నా అత్తయ్య, మామయ్య చూపించే పిసినారితనం, లేకితనం చూసి నాకు అసహ్యం ఏర్పడింది.

మామయ్యగారింటికి కాలేజీ దూరం కాబట్టి తొమ్మిదింటికల్లా పచ్చడి, మజ్జిగ వేసుకుని తిని కాలేజీకి వెళ్ళిపోయేవాణ్ని. మధ్యాహ్నం కరకర ఆకలేసేది. హోటల్లో పడి తినేంతటి తాహతు నాకు లేదు. డబ్బులుంటే మొక్కజొన్న పొత్తులు, జాంకాయలు తిని కడుపు నింపుకునే వాణ్ని. సాయంత్రం ఇంటికివచ్చి ముఖం కడుక్కుని మళ్ళీ సుదర్శనంగారింటికి ట్యూషన్‌కి వెళ్ళేవాణ్ని.

సుదర్శనంగారు మా లెక్చరర్. ఆయన నన్ను, నా తెలివితేటల్ని మెచ్చుకొనేవారు. డబ్బు తీసుకోకుండా నాకు ట్యూషన్ చెప్పేవారు. అది ముగించుకుని ఇంటికొచ్చే సరికి రాత్రి పది.

అన్నం తిందామని వంటింట్లోకి వెడితే ఎలా గ్రహించేదో — అన్నపూర్ణ వచ్చేది. తనే వడ్డించి నేను తినే వరకూ ఎదురుగా కూర్చునేది.



తన కష్టం చెప్పుకోడానికి నేనే దిక్కు. ఆమెను ఓదార్చి, ధైర్యం చెప్పి పంపేవాణ్ని. ఆమె నా కళ్ళముందు కన్నీళ్ళెట్టుకుంటే నాకే మిటో గుండెలో కెలుకుతున్నట్టనిపించేది.

ఆమెకు ఎంత ధైర్యం చెప్పినా, ఆమె పరిస్థితి నాకే బాధకలిగించేది. నేనక్కడ మహా వుంటే కొన్నేళ్ళు. కాని ఆమె

ఆ ముళ్ళ కంచెలమధ్య, ఆ పాషాణ హృదయాల మధ్య ఈ పెల్లాంటి వాళ్ళ మాటలు భరిస్తూ, వాళ్ళ నిరసన సహిస్తూ—అనాదరణను శిరసావహిస్తూ .లేని సహనాన్ని తెచ్చుకుని-జీవించడంకోసం-కేవలం తిండికోసం ఎన్నాళ్లు? ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళు?

భగవాన్! మనిషికి ప్రాణంపోసి పుట్టించి, అది నిలబెట్టుకోడానికి ఎంతబాధ, ఎంత యాతన, ఎంత పోరాటం, కల్పించావ్—

ప్రతి రాత్రి నేను అన్నపూర్ణ గురించి ఆలోచించేవాణ్ని.

సమస్య పెద్దది ..ఓ మనిషి జీవితం—

పరిష్కారం ...శూన్యం.

ఆమెకు ధైర్యం చెప్పడం తప్ప ఏమీ చేయలేను.

నాకే వాళ్ళింట్లో పొందే ట్రీట్‌మెంట్ చూస్తే అసహ్యం వేసేది. అంతలోనే "ఎల్లాగో అల్లా కాలక్షేపం చెయ్యి నాన్నా!" అని నాన్న చెప్పే హిత వచనాలు జ్ఞాపకం వచ్చేవి. ఆయన నాకోసం, నా భవిష్యత్తు కోసం పడేబాధ, ఆరాటం గుర్తుకొచ్చేవి. ఐదునెలలు గడిచాయి—

నాకు అస్తమానం రాత్రిళ్ళు దగ్గువచ్చేది. అందుకని కాఫ్‌సిరప్ కొని అట్టిపెట్టుకునే వాణ్ని. ఓ రాత్రి నన్ను మామయ్య నిద్రలేపి తనకి దగ్గొస్తూందని మందు కావాలని అడిగాడు. గూట్లో వుంది తీసుకొమ్మన్నాను. ఓ వారం తర్వాత నాకు మళ్ళీ దగ్గు ప్రారంభమయ్యింది. తీరా చూస్తే సీసాలో సిరప్ అంతా అయిపోయింది. కొనుక్కోడానికి డబ్బులేదు. రాత్రిళ్లు ఊపిరి అందనంతగా దగ్గు వచ్చేది. మామయ్య దగ్గరకెళ్ళి మందు కొనమని అడిగాను.

ఆయన కొనలేదు.

రెండో రోజు అడిగాను.

"నువ్వు ఇంట్లో పడి తినడం లేదురా—నాలుగు చెంచాల మందు వాడుకుంటే కొనిమ్మని నిలదీస్తున్నావ్—" అన్నాడు.

ఎంత దరిద్రం అనుభవించినా ఫరవాలేదు. వ్యక్తిత్వం చంపుకుని బతకూడదు—అనిపించింది.

నెలకి డభై రూపాయలు తీసుకుంటూనే ఎంత నిరసనగా మాట్లాడాడు.

వాళ్ళింట్లోంచి బైటకువెళ్ళి పోవాలని నిర్ణయించుకున్నాను. వేరే రూంలో ఫ్రెండ్‌తోపాటు ఉండి వండుకు తినాలని నిశ్చయించుకున్నాను.

అన్నపూర్ణను ఒక్కదాన్నిఆ చిరుతపులుల మధ్య వదిలిపెడుతున్నానన్న బాధ తప్ప నాకు వేరే బాధనిపించలేదు. నేను వుండీ ఆమెకు చెయ్యగల్గిందేం లేదు——మాట సాయం తప్ప.

మర్నాడే ఆ ఇంట్లోంచి వెళ్ళిపోయాను.

తర్వాత కాలం చకచక సాగిపోయింది.

మెరిట్ స్కాలర్‌షిప్పులతోటి, మా వూళ్లో ఇద్దరి ముగ్గురి సాయంతోటి ఎం. ఎ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. బాంక్‌లో ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. సంవత్సరం తిరగ్గానే ఛీఫ్ ఆఫీసరయ్యాను.

వారం క్రితం అన్నపూర్ణ పెళ్ళంటూ మామయ్య రాసిన ఉత్తరం అందుకుని వెంటనే తాడేపల్లి గూడెంలో మా బాంక్ మానేజర్ వీరేంద్రకు ఫోన్‌చేసాను.

అతన్నాకు మంచి స్నేహితుడు కూడా.


వాళ్ళింట్లో ఓ రోజు వుండి అతని కారులోనే భీమవరం బైల్దేరాను.

* * *

"ఎక్కడ పెళ్ళి—" వీరేంద్ర అడిగాడు.

చెప్పాను.

మరో పది నిముషాల్లో మా కారు ఆ గుడి ముందు ఆగింది. శంకరం మామయ్య నన్ను చాలా ఆదరంగా ఆహ్వానించాడు. నా కోసం




అక్కడికి వచ్చిన మా బాంక్ మానేజర్స్ నా ఫ్రెండ్స్ అంతా నన్ను చుట్టుముట్టేశారు.

"వీడు మా ఇంట్లోవుండి చదువుకున్నాడు, ఇంత పెద్ద వాడయ్యాడు—ఇప్పుడు రెండు వేలు జీతం" మామయ్య అందరికీ గర్వంగా చెప్పుకుంటున్నాడు.

పెళ్ళి మంటపంలో పెద్దగా జనంలేరు.

కొద్దిసేపు పోయాక నన్ను ఒంటరిగా కూర్చోపెట్టి తన బాధలన్నీ చెప్పుకున్నాడు మామయ్య.

తనకూతురు జలజను పెళ్లిచేసాట్ట. అల్లుడు కట్నం సొమ్మంతా తాగేశాట్ట. డబ్బు పట్ర మ్మని పెళ్ళాన్ని తన్ని అస్తమానం పుట్టింటికి పంపేస్తూంటాడట. కొడుకు లెవ్వరికీ చదువులు అబ్బలేదట.

మామయ్యమీద జాలేసింది.

స్వతహాగా ఆయన మంచివాడే—

ఆస్థి, అత్తయ్య కలిసి ఆయన్ను పాడు చేసారు.

అల్లుడికి బాంక్‌లో ఉద్యోగం ఇప్పించమని అడిగాడు.

పెళ్ళిపీటలమీద కూర్చున్న అన్నపూర్ణను సుమారు ఏడేళ్ళ తర్వాత చూశాను. గుర్తుబట్ట లేనట్టుగా వుంది. వెయ్యి నూటపదహార్లు కట్న మిచ్చి మామయ్యే ఆ పెళ్ళి చేస్తున్నాడు. కుర్రాడు ఇంటర్ పాసయ్యాడు.

. అన్నపూర్ణ పెళ్ళి బట్టల్లో నిండుగా అందంగా వుంది. అత్తయ్య, మామయ్య నాకు తెగ మర్యాదలు చేస్తున్నారు.

పెళ్ళి పూర్తయింది.

పెద్దలందరికీ దణ్ణాలు పెట్టిస్తూ పురోహితుడు దంపతుల్ని నా దగ్గరకు తీసుకొచ్చాడు.

"జ్ఞాపకమున్నానా?" ఆప్యాయంగా అడిగాను.

"భలేవాడివి-ఎలా మర్చిపోతాను" నవ్వుతూ అంది అన్నపూర్ణ.

కుశలప్రశ్న లయ్యాక ..

"అన్నట్టు మామయ్యగారింట్లో వున్నప్పుడు నిన్నో ప్రశ్న అడగాలనుకునేవాణ్ని. అప్పట్లో అడగలేదు—తర్వాత ఎన్నోసార్లు నువ్వు జ్ఞాపకంవచ్చినప్పుడల్లా ఆ ప్రశ్నకూడా జ్ఞాపకం వచ్చేది. ఇప్పుడడగనా?"

"అడుగు—"

"నేను రోజూ రాత్రి ట్యూషన్ పూర్తయి యింటికొచ్చాక నువ్వు అన్నం పెట్టేదానివి—గుర్తుందా?"

"ఉంది."

"అప్పుడు నాకు చిన్న పళ్ళెంలో అన్నం పెట్టేదానివి. అది నాకు సరిపోయేది కాదు—ఒకవేళ మామయ్యగారింట్లో వాళ్ళకి ఎవరికేనా ఎక్కువ ఆకలేసి ఇంకాస్త ఎక్కువ అన్నం తింటే నాకు అదికూడా మిగిలేది కాదు—అవునా?"

ఆమె మొహంలోకి ఆత్రంగా చూశాను.

అన్నపూర్ణ చిరునవ్వు నవ్వి — తలొంచుకుంది.

"ఫరవాలేదు చెప్పు పూర్ణా!" - రెట్టించాను.

"ఆ పళ్ళెంలో అన్నం నీకు వేరే తీసిపెట్టి ఏమన్నా మిగిలితే నేను తినేదాన్ని."

ఎవరో నా గుండెను రంపంతో కోస్తున్నట్టనిపించింది. వెంటనే నాకు మా అమ్మ గుర్తొచ్చింది.

నా చిన్నతనంలో మేం దరిద్రం అనుభవిస్తున్నప్పుడు మా అమ్మ పస్తులుండి నాకూ, చెల్లాయికి అన్నం పెట్టేది. కాని—అమ్మకు సాంఘికంగానో, నైతికంగానో ఓ బాధ్యత వుంది. ఆమె నన్ను మోసి, కని పెంచింది - రక్తం పంచుకు పుట్టేను.

కాని—అన్నపూర్ణకు

ఆమెలో నాకు అమ్మలాంటి దేవత కనిపించింది. జేబులోంచి చెక్‌బుక్ తీసి అంకె వేసి సంతకం చేసి ఆమె చేతిలో పెట్టాను.

ఆమె నా కాళ్ళకు దణ్ణం పెట్టింది.

అసలు నేనే ఆమెకు దణ్ణం పెట్టడం సమంజసమేమో ననిపించింది.

"మీ పేరు ఏమిటి బాబూ!"

పురోహితు డడిగాడు.

చెప్పాను.

"రామచంద్రగారు పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి ఇచ్చినవి రెండువేల రూపాయలు."

మంటపం దగ్గర కూర్చుని ఎవరితోనో మాటలాడుతున్న మామయ్య నాకేసి ఆశ్చర్యంగా చూశాడు.

"పదిహేనురోజులు పోయాక నాకు ఉత్తరం రాయండి. ఈ వూళ్ళో మా బాంక్‌లో అటెండర్‌గా ఉద్యోగం వేయిస్తాను."

అన్నపూర్ణ భర్తకి నా విజిటింగ్ కార్డందించాను.

అక్కడికి వస్తూ నా మాటలు విన్న అత్తయ్య నా ముఖంలోకి చూసింది—ఆమె చూపుల్లో అసూయ, జుగుప్స వున్నాయి.

నేను అన్నపూర్ణ ముఖంలోకి చూశాను. ఆమె ముఖంలో ఆప్యాయత, ఆనందం, కృతజ్ఞత వున్నాయి.

నా గుండెల్లో ఏదో సంతృప్తి నిండుకుంది. □

మీరు
చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25

సం. చందా రూ. 15/-